స్టీరింగ్ ఆటో..

- పోషణ కోసం ట్యాక్సీ నడుపుతున్న మహిళ
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న ఆటో డ్రైవర్ ఉమ



6



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం - 6:21 (సా)
సహర్ : మంగళవారం - 5:03 (ఉ)

ఎవరి ధీమా వారిదే!

- ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నేడే
- సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఓట్ల లెక్కింపు
- తొలి ప్రాధాన్యతలో ఫలితం తేలకుంటే ఎలిమినేషన్ పద్ధతి
- ఎనిమిది రౌండ్లలో ఓట్ల లెక్కింపు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ గోదాంలో కౌంటింగ్ ఏర్పాట్ల దృశ్యం

ఇల్లెందు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు సోమవారం నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపునకు మొత్తం 25టేబుళ్లు ఏర్పాటు చేశారు. హోరాహోరీగా జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరులో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ తెలంగాణ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డిల మధ్య ప్రధాన పోటీ కేంద్రీకృతం కావడంతో వివిధ జిల్లాల్లో జరిగిన పోలింగ్ సరళిపై అంచనాలు వేసుకున్న ప్రధాన పోటీదారులు ఎవరికి వారు గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన పోటీదారుల నడుమ నువ్వా.. నేనా.. అన్నట్లు పోటీ జరగడం, పోలింగ్ సరళి, రెండో ప్రాధాన్యత ఓట్లు అనివార్యంగా మారిన పరిణామాలతో ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు బేరీజు వేసుకున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అభ్యర్థులు గెలుపు తమదంటే తమదేనని చెబుతున్నారు.

జిల్లాల వారీగా జరిగిన పోలింగ్..

శాసనమండలి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏర్పడిన 12 నూతన జిల్లాల్లో మొత్తం 25,797 ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 24,139 ఓట్లు పోలయ్యాయి. సిద్దిపేటలో 156, జనగాంలో 945, హన్మకొండ 4,780, వరంగల్ 2,213, మహబూబాబాద్ 1,571, భూపాలపల్లిలో 310, ములుగు 583, భద్రాద్రి కొత్తగూడెం 1,859, ఖమ్మం 3,805, యాదాద్రి భువనగిరి 950, సూర్యాపేట 2,530, నల్లగొండ 4,437ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అత్యధికంగా హన్మకొండ, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో పోలింగ్ నమోదుకావడంతో మూడు జిల్లాల్లో వేర్వేరు సంఘాల అభ్యర్థులు పోలింగ్ సరళిని ప్రభావితం చేశారన్న ప్రచారంతో ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముందుగా నిర్వహిస్తారు. మొత్తం పోలైన ఓట్లలో చెల్లుబాటు ఓట్లు ఖరారైన తరువాత విజయానికి అవసరమైన ఓట్ల కోటా నిర్ణయిస్తారు. సగానికంటే ఒక్క ఓటు అధికంగా లభించిన వారిని విజేతగా నిర్ణయిస్తారు. అయితే తొలి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికి కూడా చెల్లుబాటు ఓట్లలో 50 శాతానికి మించి ఓట్లు లభించకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో ఓట్లు లెక్కింపు నిర్వహిస్తూ విజేతను ఎంపిక చేస్తారు.

ఓట్ల లెక్కింపు ఇలా..

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాధారణ అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపులకు భిన్నంగా ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఒక్క ఓటు అధికంగా లభించినా అతడిని విజేతగా ప్రకటిస్తారు. కాగా ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో పోలై చెల్లుబాటైన మొత్తం ఓట్లలో సగానికి పైగా సాధించి ఒక్కఓటు అధికంగా లభించిన వారిని విజేతగా నిర్ణయిస్తారు. ఒకవేళ తొలి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికి కూడా సగానికి మించి ఓట్లు లభించకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో (పోటీ నుంచి తొలగింపు పద్ధతి) ఓట్లు లెక్కిస్తారు. కోటా ఓట్లు లభించేంత వరకు ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఉదాహరణకు మొత్తం ఓట్లలో చెల్లుబాటైన ఓట్లు 10 వేలు ఉంటే కోటా ఓట్లు 5001 లభించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. అయితే మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ 5001 ఓట్లు లభించకపోతే ఎలిమినేషన్ పద్ధతిలో పోటీలో ఉన్నవారిలో అందరికంటే తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థిని తొలుత ఎలిమినేట్ చేసి అతడి బ్యాలెట్ పత్రాల్లోని రెండో ప్రాధాన్యత ఓట్లు మిగిలిన అభ్యర్థుల్లో ఎవరికెన్ని లభించాయో లెక్కించి వారికి కలుపుతారు. అయినా కోటా ఓట్లు ఏ అభ్యర్థికి లభించకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. అయినా కోటా ఓట్లు లభించనిపక్షంలో నాలుగో ప్రాధాన్యత ఓట్లు లెక్కించి మిగిలిన అభ్యర్థులకు జమ చేస్తూ ఫలితం తేలే వరకు ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారు. చివరికి ఇద్దరు అభ్యర్థులు మిగిలి ఉండగా వారిలో ఎవరికి కూడా కోటా ఓట్లు లభించకపోతే రెండోస్థానంలో ఉన్న అభ్యర్థి ఓట్లను అత్యధిక ఓట్లు సాధించి ముందంజలో ఉన్న అభ్యర్థికి జమచేసి విజేతగా నిర్ణయిస్తారు.



నిలిచిపోయిన భవన నిర్మాణం

నిలిచిన నిర్మాణం

- ఇసుక తవ్వకాలపై ప్రభుత్వ నియంత్రణ
- నూతన పాలసీపై స్పష్టత లేక ఇసుక సరఫరా బంద్
- ఇసుక, కంకర కొరతతో కుదేలవుతున్న నిర్మాణ రంగం
- పనులు లేక కూలీలు, మేస్త్రీల ఇబ్బందులు

కొత్తగూడెం టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఇసుక తవ్వకాలపై నియంత్రణ విధించడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అనేక పట్టణాల్లో ఇసుక కొరత ఏర్పడింది. గత 15 రోజులుగా ఇసుక రవాణా నిలిచిపోవడంతో నిర్మాణ రంగంలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక రవాణ నిలిచిపోవడం, జిల్లాలో క్రషర్‌మిషన్లను సైతం నిలిపివేయడంతో కంకర దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న తాపీమేస్త్రీలు, కూలీలు, రాడ్‌బెడ్డింగ్, ఎలక్ట్రీషియన్లకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని పురపాలకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులు సైతం నిలిచిపోయాయి. వేసవిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు నిలిచిపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లపై పని ఒత్తిడి పెంచే పరిస్థితి లేకుండాపోయింది. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుండటంతో ఈ ఇసుక ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలకు లభించగా ప్రస్తుతం ఇసుక అసలుకే దొరకడం లేదు. మొర్రేడువాగు, (మిగతా 6వ పేజీలో)



అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడ్డ బియ్యం లారీలు (ఫైల్)

బియ్యం దందా.. అదే పంథా

తెలంగాణ నుంచి ఏపీకి భారీగా తరలుతున్న బియ్యం

బియ్యం అక్రమ రవాణాకు అశ్వారావుపేట నుంచి కాకినాడ వెళ్లే రహదారి రాచమార్గంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రం నుంచి రేషన్ బియ్యంతో పాటు మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లెవీ బియ్యం కూడా అర్ధరాత్రుల్లో సరిహద్దు దాటుతోంది. తెలంగాణ నుంచి ఏపీకి నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే బియ్యం తరలిస్తున్నారు. రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా మొదలు నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల వరకు కొందరు అక్రమార్కులు రేషన్ బియ్యం, సీఎంఆర్ మిల్లింగ్ కింద ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన బియ్యాన్ని అక్రమ పద్ధతుల్లో ఏపీకి తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

- రేషన్, సీఎంఆర్ బియ్యమే అధికం
- అక్రమార్కులకు రాచమార్గంగా అశ్వారావుపేట చెక్‌పోస్టు
- నిత్యం పదుల సంఖ్యలో సరిహద్దు దాటుతున్న బియ్యం లారీలు
- ఇటీవల టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో 12 లారీల పట్టివేత
- నిరంతర నిఘాతోనే అక్రమ రవాణాకు అడ్డుకట్ట

అశ్వారావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట మీదుగా కాకినాడ పోర్టు దగ్గరగా ఉండటంతో బియ్యం లారీలు అధిక సంఖ్యలో ఇక్కడినుంచే ఏపీలోకి ప్రవేశిస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులో నామ మాత్రంగానే ఉండడంతో అక్రమార్కులకు ఇది రాజ మార్గంగా మారింది. అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది మామూళ్లకు అలవాటుపడి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పరోక్షంగా సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత శుక్రవారం రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుఝాము వరకు అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద చేపట్టిన తనిఖీల్లో కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏకంగా 12 బియ్యం లారీలను పట్టుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పట్టుబడ్డ ఈ బియ్యం ఎక్కడినుంచి వస్తున్నాయన్న రికార్డులు పరిశీలించి 9 లారీలను విడుదల చేశామని, మరో మూడు లారీలు నల్లగొండ, వరంగల్ జిల్లాల్లోని మిల్లుల నుంచి తీసుకొస్తున్నట్లు చెప్పినా ఆదివారం సాయంత్రం వరకు ఎటువంటి డాక్యుమెంట్లు అందలేదని, అందుకే ఆ లారీలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

సీఎంఆర్ బియ్యం పక్కదారి ?

గతంలో కాకినాడ పోర్టులో ఏపీ ప్రభుత్వం బియ్యం పట్టుకున్న సమయంలో తెలంగాణాలోని పలువురి వ్యాపారుల సొమ్మును భారీగానే అందులో (మిగతా 6వ పేజీలో)

అక్రమార్కులకు రాచమార్గం..

టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడుల సంగతి ఎలా ఉన్నా అశ్వారావుపేట మీదుగా తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి నిత్యం ఏపీలోకి పదుల సంఖ్యలో రేషన్ బియ్యంతో పాటు సీఎంఆర్ మిల్లింగ్ బియ్యం తరలిపోతుందనేది వాస్తవం.. ఈ మేరకు ఖచ్చితమైన సమాచారం అందడంతోనే శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అశ్వారావుపేట మీదుగా నిత్యం వందల సంఖ్యలో లారీల్లో బియ్యం తరలుతుండగా వీటిలో సీఎంఆర్ మిల్లింగ్ బియ్యం కూడా వెళుతోందనే ఆరోపణలు వ్యాపార వర్గాలలో కలకలం సృష్టిస్తోంది. ఏపీలోని కొంత మంది వ్యాపారులు, తెలంగాణా ప్రాంతంలోని వ్యాపారులతో కలిసి పలు మార్గాల ద్వారా సేకరించిన రేషన్ బియ్యంను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక కిందస్థాయి నుంచి పైస్థాయి వరకు తెరవెనుక వ్యవహారాలు నడుస్తున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

కమ్మ జాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలి

కమ్మ మహాజన సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి తుమ్మల



ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి, కార్యవర్గ సభ్యులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కమ్మ జాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం రాత్రి నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్మ ప్రభువులు వందేళ్ల క్రితం నుంచే ఖమ్మంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనేకమంది ప్రముఖులు తమ సొంత ఖర్చులతో సంఘానికి సమాజంలో మంచి పేరు తీసుకొచ్చారన్నారు. సమాజ అభివృద్ధిలో కమ్మ సంఘం కీలకంగా ఉండాలన్నారు. ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా సంఘం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు మంత్రి తుమ్మల అభినందనలు తెలిపారు. కమ్మ జాతి కీర్తి, ప్రతిష్టలు ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో ఇమిడి ఉన్నాయని, వాటిని ఇంకా పెంపొందించేందుకు నూతన కార్యవర్గసభ్యులు కృషి చేయాలన్నారు. సంఘం అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గొట్టిపాటి సత్యవాణి మాట్లాడుతూ కమ్మవారు శతాబ్దాలుగా ఎంతోమంది ఎన్నో రంగాల్లో ఆదర్శంగా నిలిచారన్నారు. మహిళలను గౌరవించటం భారతీయ చరిత్రలో ఉందని, దానిని మనం విస్మరిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. ముందుగా కమ్మ మహాజన సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారాన్ని ఎన్నికల అధికారి సమక్షంలో చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, సంఘం నూతన అధ్యక్షుడు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాముతో పాటు కార్యవర్గ సభ్యులు మాట్లాడారు.

కానిస్టేబుల్‌ను బైక్‌తో ఢీకొట్టి పరార్

- తీవ్రంగా గాయపడ్డ స్పెషల్‌పార్టీ కానిస్టేబుల్
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు
- గంజాయి స్మగ్లర్లుగా అనుమానిస్తున్న పోలీసులు
- భద్రాచలంలోని గోదావరి బ్రిడ్జి వద్ద ఘటన



భద్రాచలం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి వారధి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున పరిమితికి మించిన వేగంతో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న బైక్‌ను ఆపేందుకు ప్రయత్నించిన తెలంగాణ స్పెషల్ పోలీసు కానిస్టేబుల్‌ను సదరు బైకర్ ఢీకొట్టి పారిపోయాడు. దీంతో కానిస్టేబుల్‌కు కుడికాలు విరగడంతో ఆయనను వెంటనే స్థానికంగా ప్రాథమిక చికిత్స నిర్వహించి అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. భద్రాచలం గోదావరి వారధి చెక్‌పోస్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున సివిల్ పోలీసులతోపాటు తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగానికి చెందిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు భద్రాచలం వైపు నుంచి సారపాక వైపునకు రాంగ్‌రూట్‌లో బైక్‌పై మితిమీరిన వేగంతో వచ్చారు. దీంతో వారిని ఆపేందుకు అక్కడ విధుల్లో ఉన్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ యోగానందాచారి ప్రయత్నించగా వారు బైక్ ఆపకుండా కానిస్టేబుల్‌ను బైక్‌తో ఢీకొట్టి పారిపోయారు. దాంతో అతడి కుడికాలు విరిగింది. వెంటనే తేరుకున్న పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినా.. నిందితులు వేగంగా వెళ్లిపోయారు. బైక్‌పై వెళుతున్న సదరు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై భద్రాచలం సీఐ బరపాటి రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మించారు.. వదిలేశారు?

- రూ.5.50 కోట్ల నిధులు వృథానా?
- అందని ద్రాక్షలా గిరిజన సాంకేతిక విద్య

7

ఉత్సాహంగా నాల్గో తరగతి మహిళా ఉద్యోగుల క్రీడలు

- పోటీలను ప్రారంభించిన టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

6

స్టీరింగ్ ఆటో..



తాను నడిపే ఆటోతో డ్రైవర్ ఉమ

- కుటుంబ పోషణ కోసం ట్యాక్సీ నడుపుతున్న మహిళ
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న ఆటో డ్రైవర్ ఉమ

మణుగూరు టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలం బాపనకుంట గ్రామానికి చెందిన దేవర్ల ఉమ మణుగూరులో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తోంది. భర్త దేవేందర్ దినసరి కూలి. ఇద్దరు కూతుర్లలో ఏడేళ్ల వయస్సు ఉన్న చిన్న కూతురు అక్షయకు గుండెకు రంధ్రం పడి చికిత్స పొందుతోంది. నెలకు రూ.2వేలు మందులకు ఖర్చవుతున్నాయి. భర్త దేవేందర్‌కు కూడా తొమ్మిదేళ్ల క్రితం మెదడుకు శస్త్ర చికిత్స జరిగింది. ఆస్తిపాస్తులు లేకపోగా పూట గడవడమే కష్టంగా మారింది. ఈక్రమంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ మూడేళ్ల కిందట ఉమ పట్టుదలతో ఆటో డ్రైవింగ్ నేర్చుకుంది.

ఓ ఆటోను అద్దెకు తీసుకుని మూడేళ్ల నడిపింది. మూడు నెలల క్రితం ఫైనాన్స్‌పై సొంతంగా ఆటోను కొనుగోలు చేసింది. అన్ని ఖర్చులు పోను రోజుకు మూడు వందలు మిగులుతున్నాయని ఉమ తెలిపింది. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణ సదుపాయం కల్పించాలని, రేషన్ కార్డు అందించాలని కోరుతోంది.



పూసుకుంట గ్రామంలో జరుగుతున్న పనుల గురించి మంత్రికి వివరిస్తున్న కొయ్యల అచ్యుతరావు

అభివృద్ధి పనులను అడ్డుకోవటంపై
మంత్రి తుమ్మల ఆగ్రహం

దమ్మపేట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పూసుకుంట రహదారిలో బ్రిడ్జీల నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్లను ఫారెస్టు అధికారులు పనులను అడ్డుకుంటూ వేధింపులకు గురి చేయటం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. గండుగులపల్లిలో ఆయన నివాసంలో మంత్రి తుమ్మలను దమ్మపేట నాయకులు ఆదివారం కలిశారు. ఈసందర్భంగా మంత్రి పూసుకుంట అభివృద్ధి పనులపై ఆరా తీశారు. బ్రిడ్జీ నిర్మాణ పనులలో ఫారెస్టు అధికారులు కాంట్రాక్టర్లను ఇబ్బందులు గురి చేస్తున్నారని కొయ్యల అచ్యుతరావు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఫారెస్టు అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేశారు. పూసుకుంటలో జరుగుతున్న పనులనుత్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు.

అంతకు ముందు తుమ్మల వ్యవసాయక్షేత్రాలను సందర్శించి పంటలను పరిశీలించారు. తుమ్మలను కలిసిన వారిలో తాళ్లూరి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు తదితరులు ఉన్నారు.

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఈ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణను వైదిక సిబ్బంది నిర్వహించారు.

పాత బావిలో శ్వేతనాగు

పినపాక, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పినపాక మండలం ఉప్పాక గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఓ పాత బావిలో శ్వేతవర్ణ సర్పం ఆదివారం కనిపించింది. గత మూడు రోజులుగా బావిలోని నీటిలో ఈ సర్పం తిరుగుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఈ సర్పం పాఠశాలలోని బావిలో ఉండటంతో విద్యార్థులను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. బావిలో శ్వేతవర్ణ సర్పం ఉన్న విషయాన్ని అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. సర్పాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బావిలోని నీటిలో శ్వేతవర్ణ సర్పం

గర్భస్రావాలు చేసే వారిపై
కఠినంగా వ్యవహరించాలి

- ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా గర్భస్రావాలు, స్కానింగ్ చేస్తున్న తీరు దిగ్భ్రాంతికరమని, ఇలాంటి వారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ జగదీష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొద్దిరోజులు గర్భస్రావాల వార్తలు ఆందోళనకు గురించేస్తున్నాయని, ఇలాంటి విషయాలల్లో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించి, బాధ్యులను గుర్తించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిందితులు ఎవరైనా ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. స్కాన్ మెషిన్‌లు అమ్మేవారి నుంచి అబార్షన్లు చేసే వారిపై నిఘా పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. విషయాలు బయటకి రావటానికి తోడ్పాటు నందించిన ఐఎంఏ సభ్యులను, టాస్క్‌ఫోర్స్ సభ్యులను వారు అభినందించారు.

ముగిసిన ఫెర్టిలైజర్స్ డీలర్ల క్రీడలు

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో గత రెండు రోజులుగా జరుగుతున్న ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఫెర్టిలైజర్స్ డీలర్స్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలలో భాగంగా డిస్ట్రిబ్యూటర్స్, వ్యాపారులు, పెస్టిసైడ్స్ కంపెనీల ప్రతినిధులకు క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీలో భద్రాద్రి కొత్తగూడెం జట్టు ప్రథమ బహుమతి సాధించింది. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ బాధ్యులు గోళ్ల మొరళి, వీవీఎస్ చౌదరి, పునకొల్లు పృథ్వీ, పుల్లఖండం నాగేందర్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా నాల్గో తరగతి
మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు



టెన్నికాయిట్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్ మార్చి 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నాల్గవ తరగతి మహిళా ఉద్యోగుల క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు సంఘం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఒక వైపు ఉద్యోగ బాధ్యతలు నేరవేరుస్తూ కుటుంబ బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదిర్శ కొణిదెన శ్రీనివాసరావు, శ్రీకాంత్, ప్రకాశ్, సంఘ మహిళా ప్రతినిదులు లలితాకుమారి, రాధికారెడ్డి, రుక్మారావు, కోడి లింగయ్య, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కిష్టారం సమస్యపై మంత్రి కిషన్‌రెడ్డికి వివరించా

- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో అంబేడ్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు 21రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలపై భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం ఆయన్ను హైదరాబాద్‌లో కలిసిన సందర్భంగా గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సైలోబంకర్ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బీటలు వారిన బంకర్ ప్రమాదకరంగా మారిందని, నాణ్యతా లోపం నిర్మాణంతో పాటు సత్తుపల్లి, కొత్తగూడెంలలో సింగరేణి క్వార్టర్స్ నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని వినతిపత్రం ద్వారా కోరారు. కిష్టారం సమస్యపై తక్షణమే స్పందించి వారికి పునరావాసం కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

ఖమ్మంక్రైం, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసుహెడ్‌క్వార్టర్ గ్రౌండ్‌లో ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజసేవలో భాగంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై శ్రీపాదరావు దృష్టిసారించి ముందుకు కదిలారని, అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు 1999 ఏప్రిల్ 13న ఆయన్ను హత్య చేయడం విషాదకరఘటన అన్నారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ కుమారస్వామి, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీశైలం, సురేష్, పాల్గొన్నారు.

ఏఎంసీ కుర్చీ దక్కేదెవరికో?

- సీఎం ప్రకటనతో వైరా మార్కెట్ కమిటీ ఆశావహుల్లో చిగురించిన ఆశలు
- ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్న ఔత్సాహికులు



వైరా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల పదో తేదీలోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం లో చేసిన ప్రకటన వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. 15నెలల నుంచి వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్‌లోని ఒకే వర్గానికి చెందిన నేతల మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ కాంగ్రెస్‌లో మూడు గ్రూపులున్నప్పటికీ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వర్గానికి చెందిన నాయకులే చైర్మన్ పదవి కోసం పోటీపడుతున్నారు. దాంతో ఈ పదవిని ఎప్పుడు కట్టబెడతారో అంతుచిక్కక ఆశావహులు మదనపడుతూ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

మూడు మండలాల పరిధిలో..

వైరా, తల్లాడ, కొణిజర్ల మండలాల పరిధిలో ఈ మార్కెట్ కమిటీ ఉంది. చైర్మన్ పదవిని వైరా, కొణిజర్ల మండల నాయకు లు ఆశిస్తున్నారు. వైస్‌చైర్మన్ పదవి సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ మండలానికి కట్టబెట్టే అవకాశముంది. జిల్లాలో ఇప్పటికే ఖమ్మం, మధిర ఇంకా అనేక వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించారు. వైరాలో మాత్రం ఈ పాలకవర్గ విషయంలో ఎటూ తేలకుండా తర్జనభర్జనల వ్యవహారం కొనసాగుతుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆమోదంతోనే ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టాల్సి ఉంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కూడా వైరాకే చెందినవారు కావడంతో భట్టి విక్రమార్క సూచనలతో ఆయన కూడా తమ వర్గీయుడిని నియమించుకోవాల్సిన పరిస్థితి.

ఎమ్మెల్యేకు అభ్యర్థనలు

వైరా మునిసిపాలిటీలోని ద్వారకానగర్‌కు చెందిన బోళ్ల గంగారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు చైర్మన్ పదవి కోసం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఇద్దరిలో ఆయన ఎవరివైపు మొగ్గు చూపుతారో అర్థం కాని పరిస్థితి. మండలంలోని రెబ్బవరం మాజీ సర్పంచ్ గుత్తా కళావతి చైర్మన్ పదవి కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడి ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను కలిసి ఈ పదవిని తమకు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. సిరిపురానికి చెందిన చప్పిడి వెంకటేశ్వరరావు, స్నానాల లక్ష్మీపురానికి చెందిన నూతి వెంకటేశ్వరరావు పేర్లు కూడా విన్పిస్తున్నాయి. కొణిజర్ల మండలానికి చెందిన ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు ఇతర బీసీ నాయకులు ఈ పదవిని ఆశిస్తున్నప్పటికీ వారికి అవకాశాలు తక్కువ అని కాంగ్రెస్ శ్రేణులు చెపుతున్నాయి. మొత్తం గా గంగారావు, సీతరాములు, కళావతి మధ్యనే తీవ్ర పోటీ ఉంది. ఈనెల పదోతేదీ నాటికి తమలో ఎవరిని ఈ పదవి వరిస్తుందోనని ముగ్గురు ఆశావహులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్ బిల్లులను
విడుదల చేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

మధిర టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గత రెండున్నర సంవత్సరాలుగా ట్రెజరీలో ఆమోదం పొంది ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. ఆదివారం మధిరలో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా సెలవు జీతాలు, సప్లమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల కాకపోవటంతో ఉద్యోగులు గత మార్చి నుంచి రిటైర్ ఐనా ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్ మొత్తాలను చెల్లించక పోవడం వలన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, పీఆర్‌సీ నివేదికను వెంటనే తెప్పించి, ఉద్యోగ సంఘాలతో చర్చించి అమలు చేయాలని కోరారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ అమలు చేయాలని, ఎంఈవో, డీఈవో పోస్టులను మంజూరు చేసి రెగ్యూలర్ పోస్టులను నింపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ నాయకులు షేక్ నాగూర్‌వలీ, కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, వినోదరావు, వీరయ్య, వీరబాబు, ఆంజనేయులు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆస్పత్రి పరిసరాలు

- జిల్లా దవాఖానాలో దుమ్ము,ధూళితో నిండిన పరిసరాలు
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడే వాళ్ల ఆస్పత్రికి వస్తారు. అక్కడి పరిస్థితులు రోగులను త్వరగా కోలుకునేలా ఉండాలి. కానీ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత అత్యంత ఆవశ్యకత తెలియచేసేలా ఉండాలి... కానీ ఇదిగో ఖమ్మం జిల్లా ఆస్పత్రి దుస్థితిని చూడండి..

ఆస్పత్రిలోకి అడుగు పెట్టారంటే చాలు దుమ్ము ధూళితోనే వెళ్లాల్సి వస్తోంది. ట్రామాకేర్ వైపు ఉన్న ద్వారం గుండా లోనికి వెళితే అక్కడ లోనికి వెళ్లగానే కంకర రోడ్డు దర్శనం ఇస్తుంది. తేలిన కంకర, దుమ్ము.. ధూళితో ఆ ప్రాంతం మొత్తం అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడే ఇప్పటి వరకు ప్రతి మంగళవారం సదరం క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఇదే ప్రాంతంలో ఉద్యోగుల వెల్‌నెస్ సెంటర్ ఉంది. ఇక్కడికి వచ్చే రోగులకు మాత్రం ఇక్కడి పరిసరాలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇక ఏమైనా అలసివచ్చిన రోగులు, వికలాంగులు కూర్చోవాలంటే విరిగిన బల్లలపై కూర్చోవాల్సి వస్తుంది.



జిల్లా ఆస్పత్రిలో రోడ్డు దుస్థితి ఇలా..



సదరం క్యాంపు వద్ద కుర్చీల పరిస్థితి ఇలా

అంతే కాదు ఆ బల్లలపై కూర్చుంటే దుస్తుల నిండా మట్టితో నిండిపోతుందని వాపోతున్నారు. అంతే కాదు ఆస్పత్రి వెనుక భాగంలో టీహబ్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలోనూ ఎండిపోయిన ఆకులు రాలిపోయి... కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్నాయి. వారంలో కనీసం ఒక్కసారి కూడా పరిసరాలను పరిశుభ్రం చేసే పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. ఆస్పత్రిలో ఆహ్లాదం సరికదా... అపరిశుభ్రం రాజ్యమేలుతోంది.

పట్టణ ప్రకృతి వనంలో..

జాతీయ నాయకుల జన్మదినం, వర్ధంతి సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో పట్టణ ప్రకృతి వనంలో మొక్కలు నాటడం.. ఫొటోలు దిగడం.. అంతే వేసిన మొక్కలను సంరక్షించిన నాధుడే లేరు. గత ఐదేళ్లలో ఈ వనంలో ఎన్నో సందర్భాల్లో మొక్కలు నాటించారు. కానీ వాటిని సంరక్షించడానికి శ్రద్ధ కనిపించడం లేదు. దీంతో ఈ పట్టణ ప్రకృతివనం మొత్తం పార్కింగ్ అడ్డాగా మారిపోయింది. ఇక ఆస్పత్రి భవనానికి అనుకుని ఉన్న పచ్చిక బయళ్లను హడావిడిగా వేలాది రూపాయలు వెచ్చించి పెట్టించారు. కానీ వాటిని సంరక్షించక పోవడంతో ఏడాదిలోనే అంతా ఎండిపోయి కళావిహీనంగా దర్శనం ఇస్తుంది. జిల్లా ఆస్పత్రి అధ్వాన పరిస్థితిని చూసి మంత్రి తుమ్మల అధికారులను చీవాట్లు పెట్టినా ఆస్పత్రి అధికారుల్లో చలనం రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

నిలిచిన 'నిర్మాణం'

(5వ పేజీ తరువాయి)

గోధుమవాగు, కిన్నెరసాని, తదితర ప్రాంతాల నుంచి ఇసుక రవాణా నిలిచిపోయింది.

ఇసుక పాలసీపై స్పష్టత కరువు

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఇసుక పాలసీపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో నిర్మాణరంగం కుంటు పడుతోంది. సొంత ఇళ్ల నిర్మించుకునేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి కాలంలో ఇళ్ల నిర్మాణాలు అధికంగా కొనసాగనున్నాయి. జిల్లాలో కంకర కొరత ఏర్పడటంతో ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రాలోని తిరువూరు నుంచి కొంతమంది కాంట్రాక్టర్లు కంకర్‌ను తీసుకొచ్చి అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు నిర్మాణ రంగం నిలిచిపోవడంతో సిమెంట్ ధరలు తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. గోదావరి ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చి ఇసుక రవాణా చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే వేసవికాలంలో నిర్మాణాలు పెరిగే అవకాశాలు ఉన్నట్లు భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు. నిర్మాణ పనులు లేకపోవడంతో కార్మికులు ఖాళీగా ఉంటున్నారు. దాంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక బట్టీల్లోనూ కొనుగోళ్లు నిలిచిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రజల అవసరాలు, నిర్మాణ రంగం ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇసుక రవాణాపై సరైన నిర్ణయం తీసుకుని నిర్మాణ రంగ కార్మికులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఉపాధి కోల్పోతున్నాం..
చలమల రాము, తాపీ మేస్త్రీ



ఇసుక, కంకర కొరత కారణంగా పనులు లేకపోవడంతో ఉపాధి కోల్పోతున్నాం. నిర్మాణ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు ఉపాధి లభించడం లేదు. రోజువారీ పనులు చేస్తేనే ఇళ్లు గడిచేది. గత 15రోజులుగా పనులు నిలిచిపోయాయి. కూలీలకు సైతం పనులు కల్పించలేకపోతున్నాం. నిర్మాణదారులకు ఇంటి పనులు ముందుకు సాగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక, కంకరను అందుబాటులోకి తెచ్చేలా జిల్లా అధికారులు ప్రయత్నిస్తే నిర్మాణ రంగంపై ఆధారపడ్డ తమలాంటి మేస్త్రీలకు ఉపాధి లభిస్తుంది.



బియ్యం దందా.. అదే పంథా

(5వ పేజీ తరువాయి)

ఇరుక్కునట్టు తెలుస్తోంది. అయితే ఆ దాడుల తరువాత కొద్ది నెలలు ఆగిన ఈ రేషన్ బియ్యం దందా మళ్లీ యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని పలు మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన మిల్లింగ్ బియ్యం ఇవ్వకుండా భారీగా ఏపీకి తరలిస్తున్నారని ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ అధికారులు నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే టాస్క్‌ఫోర్స్ అధికారులు అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. తనిఖీలు చేసిన అధికారులు స్వాధీనం చేసుకున్న లారీల్లోని బియ్యానికి సంబంధించిన పత్రాలు రోజులు గడిచినా రాలేదని చెప్పడం అనేక అనుమానాలు కలిగిస్తోంది. అధికారులను మభ్యపెట్టి తప్పుడు పత్రాలు సృష్టించి తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మించారు.. వదిలేశారు...?

రూ.5.50 కోట్ల నిధులు వృథానా ...?

అందని ద్రాక్షలా గిరిజన సాంకేతిక విద్య

చుంచుపల్లి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గిరిజన ఇలాకాలో తెలంగాణ రాష్ట్రంలోనే 2016 సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూ.5.50 కోట్లుతో మంజూరు చేసి ప్రత్యేక గిరిజన ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేసేందుకు అడుగులు వేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని యువత నక్సల్స్ వైపు ఆకర్షించ బడకుండా పదేండ్ల కిందట భద్రాద్రి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గిరిజన ఐటీఐ నిర్మాణాలు ప్రారంభించారు. గిరిజన పిల్లలకు, విద్యార్థులకు సాంకేతిక విద్యను పూర్తి స్థాయిలో ఉచితంగా అందించేందుకు కళాశాల భవనంతో పాటుగా వసతి గృహాన్ని నిర్మించారు. చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండా గ్రామ పంచాయతీలో ఈ నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. భవనం నిర్మాణాలు పూర్తయినా ఇప్పటి వరకు కళాశాల ప్రారంభం కాకపోవడం గమనార్హం.

అందని ద్రాక్షగా గిరిజన సాంకేతిక విద్య ..

ప్రత్యేక గిరిజన ఐటీఐ కళాశాల భవనం నిర్మాణం పూర్తయి సుమారు ఐదేళ్ళు గడిచిన గిరిజన విద్యార్థులకు సాంకేతిక విద్య అందని ద్రాక్షగా మిగిలింది. దీంతో కోట్ల వ్యయంతో కట్టిన ప్రత్యేక గిరిజన ఐటీఐ భవనం నిరుపయోగంగా దర్శనమిస్తుంది. గిరిజన ఇలాకాలో విద్యార్థులకు చేరువ అవ్వాల్సిన సాంకేతిక విద్య ఆమడ దూరంలో ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్రంలోనే తొలి గిరిజన ఐటీఐ కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని కళలు కన్నా వారి ఆశలు ఆవిరయ్యాయి. అదే విధంగా ఈ కళాశాలకు ప్రహరీ గోడ, విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయమై, మందు బాబులకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని స్థానిక నివాసులు ఆరోపిస్తున్నారు. కళాశాల భవనంతో పాటు ప్రాక్టికల్స్ ల్యాబ్‌లు, వసతి గృహాలు నిర్మించిన పంచాయతీరాజ్ అధికారులు నిధులు లేమితో ప్రహరీ నిర్మాణాన్ని వదిలేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో కాలం గడుస్తోంది కానీ తరగతులు నిర్వహించేందుకు బిల్డింగ్ అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జిల్లా యంత్రాంగం గిరిజన ఐటీఐ కళాశాలలో పెండింగ్ పనులన్నీ తక్షణమే పూర్తి చేసి, తరగతులు ప్రారంభించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రత్యేక గిరిజన ఐఐటీ కళాశాల ఇదే..

పూర్తి చేసి అప్పగించాం

శ్రీనివాసరావు, పీఆర్, ఈఈ

గిరిజన ఐటీఐ కళాశాల భవనం నిర్మాణాలు మాకు సూచించిన విధంగా పూర్తి చేశాం. రుద్రంపూర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు నివేదిక అందించి స్వాధీనం చేసుకోమని లేఖను రాశాము. వాళ్లు ముందుకు రాకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. మాకు అప్పగించిన మేరకు మేము పనులు పూర్తి చేసి, వారికి అప్పగించాలని లేఖ రాశాము. వారి నుంచి స్పందన లేదు. దాంతో అది నిరుపయోగంగా ఉంది.

అసంపూర్తి పనులతో అప్పగిస్తే ఎలా..?

రమేష్, ఐటీఐ ప్రిన్సిపాల్, రుద్రంపూర్

ప్రత్యేక గిరిజన ఐటీఐ భవనం అసంపూర్తిగా ఉంది. ఆ పనులను అలాగే ఉంచి మేము ఎలా స్వాధీనం చేసుకోవాలి. ఈ కళాశాలలో విద్యార్థులు సంఖ్య మంజూరు, సిబ్బంది పోస్టుల విషయాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే, భద్రాద్రి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళాం. ప్రభుత్వం పోస్టులను మంజూరు చేస్తే ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు ప్రారంభిస్తాం. ఈ కళాశాలకు కావాల్సిన మిషనరీ , ఫర్నీచర్ కోసం దాదాపు రూ.1.50 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

అర్ధ శతాబ్దం తర్వాత అపూర్వ కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ జడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు 50ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. జిల్లాలోని సుజాతనగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1975 నాటి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కొత్తగూడెం లేపాక్షి హోటల్‌లో కలుసుకున్నారు. పాఠశాల వదిలి 50ఏళ్లు దాటిన సందర్భంగా జూబ్లీ రీ యూనియన్ పేరుతో స్నేహితులందరూ ఒక చెంతకు చేరారు. పూర్వ విద్యార్థులందరూ పాఠశాల పేరుమీద కొంత నగదును డిపాజిట్ చేయగా.. వచ్చే వడ్డీతో ప్రతి యేడాది పదవ తరగతి చదివే విద్యార్థులకు నగదును ప్రోత్సాహకంగా అందజేయాలని, పూర్వ విద్యార్థుల్లో ఎవరైనా ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహాయం చేయాలని తీర్మానించారు. పీవీకే. ఉపేందర్ (విశ్రాంత హెచ్‌ఎం) కృషితో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక పలువురికి ఆదర్శంగా నిలిచింది. తమకు చదువు చెప్పిన హనుమంతాచార్యులు, సీతారామయ్య(తెలుగు), కేసిరెడ్డి, ఈ.కృష్ణమూర్తి (గణితం), ప్రసాద్‌రెడ్డి (సైన్స్), ప్రభాకర్‌రావు (సోషల్) రామారావు(పీఈటీ) దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.సురేష్‌కుమార్, కె.ప్రభాకర్‌రావు, ఎల్.లక్ష్మా, జి.సత్యనారాయణ, కె.వేణుగోపాల్, ఉమారాణి, కృపారాణి, జహరున్నీసా బేగం, కె.రమేష్ కృష్ణయ్య, క్రిష్ణార్జునరావు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌తో మోసం

» ముగ్గురిపై కేసు నమోదు » సీఐ భాను ప్రకాష్ వెల్లడి

ఖమ్మంక్రైం, మార్చి2(ఆంధ్రజ్యోతి): భూములు లేకపోయినా తప్పుడు రిజిస్ట్రేషన్లు చేస్తూ డబల్ రిజిస్ట్రేషన్ల ద్వారా లోన్లు ఇప్పిస్తామంటూ మోసం చేస్తున్న వారిపై కేసు నమోదుచేసినట్టు ఖానాపురంహవేలి సీఐ భానుప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురానగర్ ప్రాంతానికి చెందిన షేక్ బడేసాహెబ్, చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన కొత్తపల్లి వెంకటేశ్వర్లు , రెవెన్యూ అధికారి తిప్పర్తి అశోక్‌కుమార్ కొంతమంది అమాయకులను నమ్మించి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేశారని పేర్కొన్నారు. ఆతర్వాత రుణాలు సైతం ఇప్పిస్తామంటూ మోసం చేశారని, బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్టు సీఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదుచేసి వారి వద్ద నుంచి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని, ఈదందా వ్యవహారంలో ఇంకా విచారణ కొనసాగుతున్నట్టు సీఐ తెలిపారు.

జిల్లాలో మొట్టమొదటి సారిగా..

షార్ట్‌ఫిలిమ్స్ ప్రదర్శన



సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ దాశరధి ఫిలిం సొసైటి హైద్రాబాద్ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంగా దాశరధి ఫిలిం సొసైటి పలు లఘు చిత్రాలను ప్రదర్శిస్తుంది. దీనిలో భాగంగా ఖమ్మం నగరంలోని నెలనెల వెన్నెల సహకారంతో ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళ్యాణ మండపంలో ప్రయోగాత్మకంగా మొట్టమొదటిసారి లఘు చిత్రాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అవార్డులు పొందిన, లఘు చిత్రాలను, స్థానిక కళాకారులు రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. చంద్రుడు,అంతరం, సాగరవాసి, శుభసంకల్పం, వాట్సాప్ స్టేటస్, జన్మనిచ్చిన తల్లి, వలస గోస తదితర లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఖమ్మం జిల్లా వాస్తవ్యులు లఘు చిత్రాల దర్శకుడు మొగిలి గుణకర్ దర్శకత్వం వహించిన లఘు చిత్రాలు, ఖమ్మం ప్రముఖుల నటించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు.అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ విజయ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యకుమార్, జగన్మోహన్‌రావు, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, సదానందం పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు గడువు 25

పాల్వంచటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు తుది గడువు మార్చి 25 అని, ఈ లోగా అందరూ తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని విశ్రాంత పాల్వంచ యూనిట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ బ్రహ్మారావు, ఎండీ. సాబుద్దీన్‌ఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ కార్యాలయంలో కూడా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేస్తారని వారు పేర్కొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెరగాలి

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాస్త్రీయ ఆలోచనలు పెరిగేందుకు జెవివి(జనవిజ్ఞాన వేదిక)కార్యకర్తలు కృషి చేయాలని జెవివి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కెవిఎల్ కాంతారావు అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జెవివి అవతరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. పదేళ్లుగా మతోన్మాద శక్తులు మూడనమ్మకాలను పెంచుతున్నాయన్నారు. సాక్షాత్తు పాలకులే వీటిని పెంచే పనిలో ఉండటం విచారకరమన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. చెప్పింది రుజువు చేసేది సైన్స్ మాత్రమేనన్నారు. మనిషి మనుగడకు, అభివృద్ధికి సైన్స్ దోహదం చేస్తుందన్నారు. ప్రశ్నించే తత్వాన్ని సైన్స్ సైన్స్ నేర్పుతందన్నారు. అందరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు.ప్రజల్లో అవగాహన పెంచేందుకే జెవివి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రపంచీకరణ దుష్పలితాల వలన మనిషిలో అభద్రాతా భావం పెరిగిందని, దీంతో మూఢనమ్మకాల వైపు పయనిస్తున్నాడన్నారు. అందుకే మూఢనమ్మకాల నిర్మూలనకు పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గతంలో సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ముందుగా జేవీవీ నాయకుల ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు అలవాల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వి.మోహన్, కట్టా సత్యప్రసాద్, వాసిరెడ్డి మల్లిఖార్జునరావు, వీరభద్రారావు, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంతారావు

ప్రజా ప్రతిఘటన యోధుడు రవన్న

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుపాకి పట్టి జీవితాంతం అజ్ఞాతంలో గడిపి పేద ప్రజల వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటాలు చేసిన యోధుడు రవన్న(రాయల సుభాష్ చంద్రబోస్) అని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కైకొండాయిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో రవన్న 9వ వర్ధంతి సభ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆదివాసీ హక్కుల కోసం గిరిజన ప్రాంతాల్లో అనేక ప్రతిఘటన పోరాటాలు చేశారని వివరించారు. మైదాన ప్రాంతంలోని ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడారని కీర్తించారు. నేటీ సమాజంలో పెట్టుబడిదారి వ్యవస్థ పెరిగిపోయిందని, ప్రభుత్వ సంస్థలు ప్రైవేటీకరణ కారణంగా కార్మికులు, కర్షకులు తమ హక్కుల్ని, రిజర్వేషన్లు కోల్పోతున్నారని వివరించారు. కాలం మారిన ప్రజా సమస్యల కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులు ఎప్పటికి చరిత్రలో నిలిచి ఉంటారన్నారు. ఈ నెల 9న రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రవన్న వర్ధంతి సభను ఏర్పాటు చేశామని ప్రకటించారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కె.శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, జిక్కుల భరత్, జాలాది లెనిన్, ధరణ్‌కృష్ణ, బొమ్మకంటి రమేశ్, రామనాధం, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, చింతీరాల నాగయ్య, రాచబంటి రవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతు ఆత్మహత్యలు లేని సమాజం కావాలి

కూసుమంచి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైతన్నల ఆత్మహత్యలు సమాజానికి మంచిదికాదని, రైతు ఆత్మహత్యలు లేని సమాజం కోసం పాలకులు కృషి చేయాలని తెలంగాణ రైతు సంక్షేమసమితి ప్రధానకార్యదర్శి వంగూరి నర్సింహ కోరారు. ఆదివారం కూసుమంచి మండలం తుర్కగూడెం గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు బుర్రదుర్గయ్య కుటుంబాన్ని పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్థికసాయం అందించి చిన్నపిల్లల చదువుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు వ్యవసాయంలో అప్పులు అయితే బలవన్మరణాలకు పాల్పడుతు కుటుంబాలకు తీరని వేదన మిగులుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని హితవుపలికారు. ఎటువంటి స్వార్థం లేకుండా వ్యవసాయం చేస్తున్న రైతుల కోసం పాలకులు అండగా ఉండాలన్నారు. సమస్యలు పరిష్కారం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. గిట్టుబాటు ధరలు కల్పిస్తు ఆత్మహత్యలు లేని సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఈకార్యక్రమంలో అదనపు కార్యదర్శి మల్లేష్, అనంతరెడ్డి, కొత్త శ్రీనివాసరావు, తుర్కగూడెం తాజా మాజీ సర్పంచి లింగయ్య, బుర్ర వెంకన్న, చెన్ను వెంకటరమణ, నరేష్ గోపి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బాధ్యులు

కాసాని సంస్మరణ సభకు సీపీఎం అగ్రనాయకత్వం

9న సుజాతనగర్‌లో వేలాదిమందితో సభ

కొత్తగూడెం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర నేత కాసాని అయిలయ్య సంస్మరణ సభకు సీపీఎం జాతీయ, రాష్ట్ర నాయకత్వం సుజాతనగర్ రానున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 9న జరగనున్న కాసాని సంస్కరణ సభ పోస్టర్లను స్థానిక మంచికంటిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసాని సంస్మరణ సభకు జిల్లా వ్యాప్తంగా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన జనరల్ బాడీ సమావేశాలు ఏర్పాటు చేసి, 9న సుజాతనగర్‌లో నిర్వహించే సభకు వేలాదిగా ప్రజలను సమీకరించి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాసాని పోరాట స్మృతులను ఆయన స్ఫూర్తిని నేటితరానికి అందించడానికి కాసని స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావడానికి ఈ సభను ఉపయోగించనున్నట్లు తెలిపారు. కాసాని పోరాట స్మృతులను ఆయన స్ఫూర్తిని నేటి తరానికి అందించడానికి కాసాని స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావడానికి ఈ సభలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాసానితోపాటు ఉద్యమంలో పని చేసిన నాయకులను ఇతర రాజకీయ పార్టీల నాయకులను కూడ ఆహ్వానించి ఘనంగా కాసాని అయిలయ్యకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఈ సభకు సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, బి. వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పోతినేని సుదర్శన్, ఇతర రాష్ట్ర నాయకత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకత్వం పార్టీ శ్రేణులు ఈ సభలో పాల్గొననున్నట్లు తెలిపారు. కాసాని స్ఫూర్తితో పేదల సమస్యలపై భవిష్యత్ పోరాటాలను నిర్వహిస్తామని అందుకు ప్రజలను సన్నద్ధం చేస్తామని, కాసాని పోరాటాలు చిరస్థాయిగా నిలిచే విధంగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కాసాని అయిలయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలు కూడ నిర్వహించి కాసాని స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. పేద ప్రజల పక్షాన కాసాని అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. ఆయన జీవితం మొత్తం పేదల పక్షాన సాగిందన్నారు. అనేక పోరాటాల్లో ప్రథముడిగా నిలిచారని అన్నారు. అనేక సమస్యలపై ప్రజా పోరాటాలు నిర్వహించిన ఘనత కాసానికే దక్కిందని అన్నారు. ఆయన పోరాటాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ నెల 9న సుజాతనగర్‌లో జరిగే సంస్మరణ సభకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటి సభ్యులు కొండపల్లి శ్రీధర్, దొడ్డ రవి, జి. పద్మ, భూక్యా రమేష్, యాస నరేష్, తులసీరాం, నందకూరి లక్ష్మి, సత్య, ఉపేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

క్రైం సమాచారం

ఉరేసుకుని రిటైర్డ్ ఎస్ఐ ఆత్మహత్య



లక్ష్మీదేవిపల్లి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ ఎస్ఐగా పని చేసి రిటైర్డ్ అయిన ఖాజా మోహీనుద్దీన్ (65) ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఎదురుగడ్డ గ్రామంలో చోటుచేసుకుంది. ఖాజామోహీనుద్దీన్ ఎదురుగడ్డలో నివసిస్తున్నాడు. అయితే భార్య అనారోగ్యం, పిల్లలు సెటిల్ కాకపోవడంతో మనోవేదనకు గురై ఖాజా మోహీనుద్దీన్ ఆదివారం తన ఇంటి వద్దనే చీరతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ఖాజాకి కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐ శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి..

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించిన సంఘటన కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని గాజులరాజం బస్తీకి చెందిన రాజేష్(24) సీసీ కెమెరా టెక్నిషయన్ వద్ద అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఉరివేసుకొని కనిపించాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు ఊరికి వెళ్ళారని, వారు వస్తేనే మృతుడి పూర్తి వివరాలు తెలుస్తాయని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం అందించి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

కల్లూరు, మార్చి2 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మధిర బ్రాంచి సాగర్ కాల్వలో ఆదివారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన గూడూరు శ్రీమన్నారాయణరెడ్డి(35) స్థానికంగా గల పాత బస్టాండు సమీపాన గల సాగర్ కాల్వలో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి గల్లంతయ్యాడు. నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో కొట్టుకొని పోయాడు. జారి పోయిన ప్రదేశంలో చెప్పులు, దుస్తులు, సెల్‌ఫోన్ ఉండటంతో శ్రీమన్నారాయణరెడ్డి పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన వ్యక్తి అని బంధువులు గుర్తించారు. ఈ మేరకు బాధితుని కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడి మృతి



దుమ్ముగూడెం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక అర్చకుడు ఆరుట్ల రాజగోపాలాచార్యులు(41) మృతిచెందారు. పాలు తీసుకొని ఇంటికి నడిచి వెళ్తున్న క్రమంలో భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై చర్ల వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న భార్య, భర్తలు రాజగోపాలాచార్యులను బలంగా ఢీకొట్టారు. తీవ్రగాయల పాలైన అర్చకుడిని భద్రాచలం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. అలాగే వాహనం నడుపుతున్న వారిలో భర్త తలకు సైతం తీవ్రగాయమైనట్లు తెలుస్తోంది. వీరివురూ భద్రాచలం వద్ద ఎర్రబోరుకు చెందిన వారని సమాచారం. పెదబండిరేవులో ఓ దశదిన కార్యక్రమానికి వెళ్లి వస్తున్నట్లు సమాచారం. లక్ష్మీనగరంలోని మూడు ఆలయాల్లో అర్చకత్వం చేస్తున్న రాజగోపాలాచార్యులకు సౌమ్యునిగా మంచి పేరుంది. అలాగే నరసాపురం శివార్లలో కారు, స్కూటీను ఢీకొట్టిన ప్రమాదంలో ఇరువురు ద్విచక్రవాహనదారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిరువురూ సీతారాంపురంలోని ఓ రైస్‌మిల్లులో పనిచేస్తారని తెలుస్తోండగా, ఒకరి కాలు విరిగినట్లు సమాచారం. ఐతే ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

కారును ఢీకొట్టిన లారీ

అశ్వారావుపేట రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కారును లారీ ఢీకొనగా కారు నుజ్జునుజ్జు అయిన ఘటన అశ్వారావుపేటలో ఆదివారం సాయంత్రం జరిగింది. పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్‌లో గల అటెండర్స్ కాలనీ వైపు నుంచి వచ్చిన కారు రోడ్డు దాటి పట్టణంలోకి వస్తుంది. ఇదే క్రమంలో ఖమ్మం వైపు నుంచి రాజమండ్రి వైపుకు వెళుతున్న లారీ వేగంగా వచ్చి కారు ఢీకొంది. కారును దాదాపు ఐదు మీటర్ల మేర లారీ లాక్కెళ్లింది. ప్రమాదంలో కొత్తగా కొనుగోలు చేసిన కారు నుజ్జునుజ్జు అయింది. కారులో బెలూన్స్ తెరుచుకోవటంతో కారును నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

చెట్టు నరికినందుకు రూ.5వేలు జరిమాన

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందున్న చెట్టును నరికినందుకు జరిమానా విధించారు. 10వ డివిజన్‌లోని ఓ వ్యక్తి తన ఇంటి ముందున్న చెట్టను నరకటంతో విషయం తెలుసుకున్న కేఎంసీ సిబ్బంది హుటాహుటిన వెళ్లి రూ.5వేలు జరిమాన విధించారు.

కొదుమూరు ఏఎన్ఎం మృతి

చింతకాని, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొదుమూరు గ్రామ ఏఎన్ఎం ఝాన్సీ (46) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. మండల వైద్యాధికారి అల్తాఫ్, సూపర్‌వైజర్‌లు కృష్ణారావు, వీరేందర్ ఇతర సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నలుగురిపై కేసు నమోదు

చింతకాని, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని ఓ మద్యం దుకాణం ఎదుట గత నెల 28న ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో తిమ్మినేనిపాలెంకు చెందిన షేక్ సయ్యద్‌ఆలీపై ముదిగొండ మండలం అమ్మపేటకు చెందిన ఉప్పిడి రాంబాబు, నాగులవంచకు చెందిన తిరపయ్య, శ్రీను, వీరనాగులు దాడి చేసి గాయపర్చారు. దాడిలో సయ్యద్‌ఆలీ కాలు విరిగింది. ఘర్షణకు సంబంధించి సయ్యద్‌ఆలీ భార్య నస్రీన్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహదేవపురంలో ఓ ఇంట్లో చోరీ

మధిర రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మహదేవపురం గ్రామంలో కలక రామారావు అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి రూ.30వేల విలువైన సొత్తును దోచుకెళ్లారు. రామారావుకు ఆరోగ్యం బాగులేకపోవడంతో కుటుంబసభ్యులంతా ఇంటికి తాళం వేసి చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. వారంరోజులపాటు వారు ఆసుపత్రిలోనే ఉన్నారు. ఆదివారం ఉదయం ఇంటికొచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గుర్తుతెలియని దొంగలు బీరువా తాళాలు పగులగొట్టి ఉంగరాలు, పట్టీలు ఎత్తుకెళ్లారు. వెండి వస్తువులను అపహరించుకుపోయారు. వీటి విలువ రూ.30వేలు ఉంటుందని బాధితుడు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

కూసుమంచి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిగేపల్లి గ్రామం సమీపంలో మట్టి రవాణా చేస్తున్న టిప్పర్.. బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో మాదాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతివేగంగా అజాగ్రత్తగా టిప్పర్ నడపుతూ.. బైక్‌ను ఢీకొట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి కాలు విరిగినట్లు తెలిపారు. వెంటనే క్షతగాత్రుని 108వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈవిసయమై ఎస్ఐ నాగరాజును వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

బంగారు నగల చోరీ

కూసుమంచి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో చోరీ జరిగింది. షేక్ సఫియా కుటుంబసభ్యులతో సహా గత నెల 27తేదీన సూర్యాపేట వెళ్లారు, ఆదివారం ఇంటికి చేరుకోగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 20గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి దుండగులు అపహరించుకెళ్లారు. ఈమేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



11న రాయల వర్ధంతి సభ

తిరుమలాయపాలెం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి సభ ఈనెల 9న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం మండలంలోని బచ్చోడులో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మంలో భక్తరామదాసు కళాక్షేత్రంలో బోస్ వర్ధంతి సభ జరుగుతుందని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు ఎస్‌కే సుబాన్, జి.వీరస్వామి, నాగయ్య, పేరం వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, శ్రీకాంత్, మల్సూర్, పాల్గొన్నారు.

కరుణగిరిలో ముగిసిన

పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలు





కర్నూలు బిషప్ జ్యానేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఫాదర్లు, హాజరైన భక్తులు

ఖమ్మంరూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీఒక్కరు దివ్య కారుణ్య తత్వాన్ని పెంపొందించుకోవాలని కర్నూలు బిషప్ జ్యానేష్ పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఖమ్మం మేత్రాసనం బిషప్ సగిలి ప్రకాష్, డైరెక్టర్ ఫాదర్ మ్యాత్యూ వరప్రసాద్ రాజు మాట్లాడుతూ లోక రక్షకుని బోధనలు నవవసంతాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా కరుణగిరి ఉత్సవాలకు మహోన్నతమైన స్థానం ఉందన్నారు. ఈ వేడుకల్లో రెండు తెలుగా రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం కరుణగిరి క్షేత్రం మహత్యాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫాదర్ మ్యాత్యూవరప్రసాద్, వీజేశౌరి,ఐజాక్, చాన్సలర్ జర్సీస్ పాల్గొన్నారు.

మిర్చికి మద్దతు ధర కల్పించాలి

తిరుమలాయపాలెం,మార్చి2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మిర్చికి మద్దతు ధర కలిపించి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. ఆదివారం మండలంలోని బీరోలులో ఆపార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి క్వింటాకు రూ.25వేలుపత్తికి రూ.15వేలు మద్దతు ధర కలిపచాలని కోరారు. రైతాంగసమస్యలపై నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం చేపడుతున్ననట్టు తెలిపారు. ఈ సమావేశంలో కె.దామోదరరెడ్డి, కె.వెంకన్న, టి.నాగేశ్వరరావు, కోడి లింగయ్య, బింగి రమేష్, దిండుమంగపతి పాల్గొన్నారు.

లక్ష్యం మించి వసూళ్లకు కార్యాచరణ

- కేఎంసీ ఖజానా నింపేందుకు ప్రయత్నాలు
- రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం రూ.32 కోట్లు
- కమిషనర్ లక్ష్యం రూ.36 కోట్లు
- ఇప్పటి వరకు వసూళ్లు రూ.22 కోట్లు
- రెడ్ నోటీసులు జారీ, మార్చి చెల్లింపులపై నిర్దేశం



ఆటోలతో ప్రచారం

ఖమ్మంసంక్షేమవిభాగం,మార్చి2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులపై ఆధారపడకుండా సొంత నిధులతో పరిపాలన చేసుకునే నగరాల్లో ఖమ్మం నగర పాలక సంస్థ ముందు వరసలో ఉంటుంది... ఏటా సునాయాసంగా ట్యాక్స్ వసూళ్ల లక్ష్యం మేరకు జరుగుతుంటాయి. అయితే 2024 సెప్టెంబరులో వచ్చిన మున్నేరు వరదల కారణంతో డిసెంబర్‌లో రావాల్సిన ట్యాక్స్ కలెక్షన్ జరగలేదు.అయినా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య జనవరినుంచి ప్రత్యేక డ్రైవ్‌లో నిర్వహిస్తూ కేఎంసీ ఖజానాను గలలాడిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదాయ వసూళ్ల లక్ష్యం కంటే ఇంకా ఎక్కువగా చేయాలని కార్యచరణ చేపట్టారు.

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం రూ.32 కోట్లు

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 2024.2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.32 కోట్లు ఆదాయ వసూళ్లు చేయాలని సీడీఎంఏ అధికారులు ఆదేశాలిచ్చారు. ఏటా నవంబరు, డిసెంబర్ మాసాల్లో ఆదాయ వసూళ్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించటం ద్వారా 50శాతం ఆదాయ వసూళ్లు జరుగుతాయి. అయితే మున్నేరు వరదల కారణంగా నవంబరు, డిసెంబర్ మాసాల్లో కేఎంసీ బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బంది పూర్తిగా మున్నేరు బాధితుల సర్వే, వారికి ప్రభుత్వ ప్రోత్సహకాలు పంపిణీకి సమయం కేటాయించాల్సి వచ్చింది. జనవరి 7, 8. 9 తేదిల్లో చేపట్టిన డ్రైవ్‌తో రూ.80 లక్షల ఆదాయం సమకూరింది. ఆదే డ్రైవ్‌ను కొనసాగిస్తుండటంతో రోజూ రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ట్యాక్స్ కలెక్షన్ జరుగుతుంది. రెగ్యూలర్ ఆదాయ వసూళ్లు మొత్తం కలిపి రూ.10 కోట్లు రాగా, స్పెషల్ డ్రైవ్ ద్వారా రూ.12 కోట్లు వచ్చింది.

ఏటా వడ్డీ రాయితీ

ఏటా రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో ట్యాక్స్ వడ్డీలపై 90శాతం రాయితీని అందిస్తోంది. మార్చి నెలలో ఖమ్మంలోని ప్రజలు ట్యాక్స్ చెల్లించే అనవాయితీ ఉంది. ఆదాయ వసూళ్ల చెల్లింపులు కానీ 1200భవనాలకు అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. వాటిలో వైరా రోడ్డు, కమాన్ బజార్, కస్బా బజార్, గాంధీ చౌక్, పోట్టి శ్రీరాములు రోడ్డులో కమర్షియల్ భవనాలు 400లకు పైగా ఉన్నాయి. దీంతో రూ.32 కోట్లు ఆదాయ వసూళ్ల నెల రోజులు లోపుగానే జరిపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

లక్ష్యానికి మించి వసూళ్లకు కార్యాచరణ

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో ఆదే స్థాయిలో బహుళ అంతస్థుల భవనాలు, కమర్షియల్ భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే సీడీఎంఏ నిబంధనల మేరకు భవనాల కొలతలు లెక్కించి ఆ మేరకు ట్యాక్స్ వసూళ్లు సక్రమంగా జరగటం లేదు. కొంతమంది రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు కమిషన్‌లకు అలవాటు పడి పాతలెక్కల మేరకు ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నారు. దీంతో నవంబరులో కమిషనర్ అభిషేక్ అగస్త్య 11వ డివిజన్‌లో ప్రైవేట్ సంస్థతో భవనాలు, కమర్షియల్ భవనాల కొలతలు తీయించారు. గణనీయమైన మార్పులు కనిపించాయి. దీంతో ఖమ్మం నగరానికి సీడీఎంఏ ఇచ్చిన లక్ష్యం రూ.32 కోట్లు కాగా లక్ష్యానికి మించి రూ.36 కోట్లు వరకు వసూళ్లు చేసేందుకు అధికారులు ఆర్థిక కార్యచరణ చేశారు.

రెజోనెన్స్‌లో విద్యార్థుల వీడ్కోలు వేడుకలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏసీపీ శ్రీనివాసులు, శ్రీధర్‌రావు, కృష్ణవేణి

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీ పాఠశాల 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ శ్రీనివాసులు, పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి హాజరయ్యారు. జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హాస్టల్ డే

ఖమ్మం,మార్చి2(ఆంధ్రజ్యోతి): ఖమ్మం సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహ(ఎ)లో ఆదివారం హాస్టల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వసతిగృహ సంక్షేమ అధికారిని నెల్లూరి విజయ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ హాజర య్యారు.ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీఎన్‌జీఓటౌన్ జనరల్ సెక్రటరీ పోలవరపు వీరాంజనేయులు, ఇన్‌చార్జి ఎస్‌డబ్ల్యూఓ అబ్దుల్ రావుఫ్, హాస్టల్ వెల్ఫేర్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని.. ఎస్సీ మాదిగలకు కేటాయించాలి

- టీపీసీసీ అధ్యక్షుడికి విన్నవించిన సోమచంద్రశేఖర్



ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఖమ్మం ఎమ్మెల్సీ స్థానాన్ని ఎస్సీ మాదిగలకు కేటాయించాలని టీపీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 20శాతం ఎస్సీ మాదిగ ఓటు బ్యాంకు ఉందని, పార్టీల గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉందన్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్‌ను గెలిపించారని వివరించారు. 1978 తర్వాత మాదిగలకు ఎమ్మెల్యేలుగా జిల్లాలో అవకాశం రాలేదన్నారు. అందుకే రానున్న ఎమ్మెల్యే కేటగిరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ మాదిగకు కేటాయించి తన పేరును పరిశీలించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌గౌడ్‌కు బయోడేటాను అందించారు.

వైద్య విద్యార్థికి

ఆర్థిక సాయం

నేలకొండల్లి,మార్చి2(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని సుర్దేపల్లికి చెందిన పేద మెడిసిన్ విద్యార్థి మాతంగి శ్రీపతికి సుర్దేపల్లికి చెందిన తెలుగుదేశం నాయకుడు గడిపూడి వెంకటేశ్వరరావు ఆదివారం రూ.10వేలను అందజేశారు.భక్తరామదాసు సర్వీస్ సొసైటీనుంచి రూ.5వేలు, నేలకొండపల్లికి చెందిన దేవరశెట్టి లక్ష్మణరావు రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో గడిపూడి వెంకటేశ్వరరావు, దేవరశెట్టి లక్ష్మణరావు, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు, కార్యదర్శి గెల్లా వెంకటరమణ,దండా రవీంద్రబాబు, పొన్నగాని శ్రీనివాస్, చావా గణపతిరావు, భవనాశి దుర్గారావు, గెల్లా జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్లకు 'టెసా సలామ్'

డీజీఎం జనార్ధన్‌రెడ్డి



కార్పెంటర్లకు సలామ్ చేస్తున్న టెసా బృందం

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోని కార్పెంటర్లకు టెసా తనవంతు సహాయం అందిస్తుందని, సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని టెసా(టీఈఎస్ఏ)డిప్యూటీ జనరల్ మేనేజరు జనార్ధన్‌రెడ్డి వివరించారు. కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా టెసా సలామ్ వారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఖమ్మం నగరంలో కార్పెంటర్లతో టెసా ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. పలువురు కార్పెంటర్‌లను సన్మానించారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన టెసా సలామ్.. ప్రతీ జిల్లాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఖమ్మం శ్రీనివాస ప్లైవుడ్స్ ఎండీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కార్పెంటర్లకు తాము ఎప్పుడు తోడుగా ఉంటున్నామని వివరించారు.ఈకార్యక్రమంలో టెసా ఎండీ అజయ్ అగర్వాల వీడియో సందేశాన్ని కార్పెంటర్లుకు చూపించారు. సేల్స్ మేనేజరు దేవులపల్లి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం



వైద్య సేవలందిస్తున్న కంటి వైద్యుడు రవిచంద్ర

నేలకొండపల్లి, మార్చి2(ఆంధ్రజ్యోతి): భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నేలకొండపల్లి, లయన్ కంటి ఆసుపత్రి, వైరా సంయుక్తంగా మండల పరిధిలోని నాచేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు ప్రారంభించారు. శిబిరంలో దాదాపుగా 200మంది రోగులను వైద్యులు పరీక్షించారు. అందులో 42మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్లు అవసరమైన వారికి త్వరలోనే వైరాలోని లయన్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేపించనున్నట్లు అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు చెప్పారు. శిబిరంలో కంటి వైద్యుడు రవిచంద్ర, ఆప్తాలమిక్ అసిస్టెంట్ శ్యామ్, సిబ్బంది వైద్య సేవలందించారు. క్యాంపు ఛైర్మన్ గెల్లా జగన్మోహన్‌రావు, కో-ఛైర్మన్‌వెల్లంపల్లి శ్రీనివాసరావులు క్యాంపును పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి గెల్లా వెంకటరమణగుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు, మాజీ అధ్యక్షుడు పొన్నగాని శ్రీనివాస్,యలమద్ది లెనిన్, సభ్యులు భవనాశి దుర్గారావు, చావా గణపతిరావు, కొత్తా రమేష్, ఓరుగంటి నారాయణరావు, నంచర్ల దేవీప్రసాద్, వాసం లక్ష్మయ్య, వల్లంచెట్ల భాస్కరరావు, షేక్.ఖాసీం, కనపర్తి కోటేశ్వరరావు, రాయల రమేష్, యర్రా సైదయ్య, మందడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరానికి మంచి స్పందన

కూసుమంచి: జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆధ్వర్యంలో కూసుమంచి మండలం గట్టుసింగారం గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతం అయింది. ఈ శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు పారుపల్లి నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదల ఆరోగ్య రక్షణకోసం జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖవైద్యులు గోర్కి, పాటిబండ్ల సుదర్శన్, పారుపల్లి నిషాంత్, కొల్లి అనుదీప్ వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇంటూరి హరగోపాల్, కోషాధికారి నాగభూషణం, బొమ్మిడి సురేష్, మౌలాలి, కల్యాణ్‌సాహు, పారేపల్లి రమేష్, రాజారావు, రమణ, పాలేరు యూనిట్ బాధ్యులు అనిల్, మల్లయ్య, డాక్టర్ రాంమోహన్‌రావు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

ప్రముఖ విద్యావేత్త రవి మారుత్

ఖమ్మంరూరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని ప్రముఖ విద్యావేత్త రవి మారుత్ అన్నారు. మండలంలోని రాజీవ్ గృహకల్ప వద్దగల గురుదక్షిణి ఫౌండేషన్‌లో కుట్టుమిషన్‌లో శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షుడు శంకరయ్య, కార్యదర్శి చావా సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.



చావా నారాయణరావుకు జన్మదిన శుభాకాంక్షలు

అభివృద్ధిలో ఆదర్శం 'చావా'



ఖమ్మం,మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రగతిని సాధించే పచ్చని చెట్లు, చిన్నారుల ఆటలకు అందమైన పార్కులు, ఆధ్యాత్మికానికి ఆలయాల పురోగతి.. ఒకప్పటి ఆ డివిజన్‌కు, ప్రస్తుతానికి పెద్ద ఎత్తున మార్పులు చేసిన ఘనత ఆయనది. అందుకే కార్పోరేటర్‌గా విశిష్టమైన సేవలదించిన ఆయన్ను ఆ డివిజన్ ప్రజలు మళ్లీ కావాలని భావించారు. ఆయనే పదో డివిజన్ మాజీ కార్పోరేటర్, మంత్రి తుమ్మల ముఖ్యఅనుచరుడు చావా నారాయణరావు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందా? లేదా? అన్న సందిగ్ధంలో ఉన్న సమయంలో చాలా మంది నాయకులు వెనకడుగు వేసినప్పటకీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి తొలి అడుగు వేశారు. నియోజకవర్గంలో ఆ పార్టీకి మరింత బలం చేకూర్చేందుకు టర్నింగ్ పాయింట్‌గా నిలిచారు. ఆయనతోపాటుగా మరికొందరు నాయకులను సైతం పార్టీలోకి ఆహ్వానించి ఖమ్మం నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీని, మంత్రి తుమ్మలను గెలిపించేందుకు ఎంతగానో కృషి చేశారు. తుమ్మల గెలుపు అనంతరం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాశ్రేయస్సు కోసం, పట్టణ అభివృద్ధి కోసం తనవంతు పాటుపడుతూ ముందుకు సాగుతున్నారు. మొదటిసారి కార్పోరేటర్‌గా గెలిచిన ఆయన డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగారు.దాంతో రెండోసారి సైతం ఆయననే కావాలని కోరుకున్న ప్రజలు 2021 కార్పోరేషన్ ఎన్నికల్లో చావా మాధురి నారాయణరావును ఏకగ్రీవంగా ఎన్నుకుని ఎవరికీ దక్కని ఖ్యాతిని ఆయనకు కట్టబెట్టారు. తన డివిజన్‌ను సుందరీకరణ దిశగాఅడుగులు వేయించారు. పదులకొద్దీ అభివృద్ధి పనులు నిర్వహించి ఆదర్శంగా నిలిపారు. డివిజన్‌లో ఏ అంతర్గత రహదారిని చూసినా సీసీ రోడ్లను నిర్మించడంతోపాటు, ఆయా రోడ్లు పచ్చని చెట్లతో కళకళలాడేలా ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
ZONE
సోమవారం 3 మార్చి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
8
WYRA, MADHIRA, SATHUPALLY
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి



ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి

» రైతుసంఘం రాష్ట్ర నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి



తల్లాడలో మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

తల్లాడ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మిర్చికి గిట్టుబాటు ధర దక్కే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం తల్లాడ మండలం కేశ్వాపురంలో రైతుసంఘం ఆధ్వర్యంలో మిర్చికల్లాలను సందర్శించి రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మిర్చి సాగుకు ఎకరాకు సుమారు రూ.250లక్షలకుపైగా పెట్టుబడి ఉందని, దిగుబడి 15 క్వింటాళ్ల లోపు వస్తుందని వివరించారు. ప్రస్తుతం మిర్చి క్వింటా ధర రూ.13వేలు మాత్రమే ఉండటం వల్ల ఎకరాకు రూ.లక్షకుపైగా రైతులకు నష్టం వస్తుందన్నారు. రైతులు అప్పులు తీర్చే పరిస్థితి లేక ఆత్మహత్యలకు సోమవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష రైతుసంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాకు మిర్చి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మన్నేపల్లి రామారావు, దేవభక్తిని రాజారావు, నారికొండ శ్రీనివాసరావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతకానిలో...

చింతకాని, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో ఆదివారం రైతు సంఘం గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, కూచిపూడి రవి, రాసాల మోహన్‌రావు, బొడ్డు కొండలరావు, నరసింహారావు పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి2(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మిర్చిపంటకు క్వింటాకు రూ.25 వేలు చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు కోరారు. ఆదివారం పలువురు వామపక్ష నేతలతో కలిసి మిర్చి కల్లాలను పరిశీలించారు.



కారేపల్లిలో...



చింతకానిలో మాట్లాడుతున్న గోవిందరావు

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ



కారేపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



సత్తుపల్లిరూరల్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్, మార్చి2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారాకపూరి కాలనీలో నూతనంగా నిర్మితమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా సాగుతుంది. ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మండాలపాడుకు చెందిన భోగి మోహనరావు, పావని బృందంచే ఏకనామం ప్రారంభమవ్వగా సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, పంగవ్యాధివాసం, ఆదివాసం హోమంతో పాటు గోపూజలో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. ప్రతాపురం గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో సాగుతున్న ప్రతిష్ఠలో 22 మంది రుత్వికులచే పూజాది కార్యక్రమాలు సాగుతున్నాయి. కాగా ఈ నెల 9న పెద్దఎత్తున ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవం సాగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గుడిపాడుకు చెందిన గుమ్మడవెల్లి కనకదుర్గాప్రసాద్, సత్యవతి, జయశంకర్, విజయలక్ష్మీలు ఆలయానికి రూ.1,11,116విరాళంగా అందజేశారు.

కారేపల్లిలో...

కారేపల్లి, మార్చి2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభంగా సాగింది. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మాజీ స్పీకర్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పాల్గొని పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



తల్లాడలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడలో...

తల్లాడ: తల్లాడలో పద్మావతి సమేత శ్రీనివాసమూర్తి కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో అర్చకులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణ, దివి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

మిత్రుడి ఇంటికి వెళ్లిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అనుచరులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బోనకల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటమర్రి గ్రామంలో ఆదివారం తన స్నేహితుడు పంతంగి వెంకటేశ్వర్లు ఇంటికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లారు. ఇంట్లో దైవ కార్యక్రమానికి సంబంధించి మంత్రిని ఆహ్వానించడంతో గ్రామానికి వచ్చారు. స్నేహితుడి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు.

మధిరటౌన్‌లో...

మధిరటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోనిరంలోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి వెళ్తూ మధిరలోని తన అనుచరుడు నాగర్జున ఇంటికి ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లారు. అక్కడ ఆయనను డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పుతుంబాక కృష్ణ ప్రసాద్ తదితరులు కలిశారు.

పలు కుటుంబాలకు తాతా మధు, సండ్ర పరామర్శ

కల్లూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కప్పలబంధం, కల్లూరు గ్రామాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు ఆదివారం పలు కుటుంబాలను పరామర్శించారు. కప్పలబంధం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురియైన మోదుగు నాగేశ్వరరావును వారు పరామర్శించారు. మందపాటి నాగిరెడ్డి దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్లూరులోని ఓ శుభాకార్యంలో పాల్గొని నూతన వధువు వైష్ణవిని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్కినేని రఘు, మందపాటి మాధవరెడ్డి, నందిగాం ప్రసాద్, మంచాల బుడ్డయ్య, చారుగుండ్ల సందీప్, సీహెచ్ కిరణ్‌కుమార్, గుర్రం పెద్దవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

» సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్

బోనకల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సంకుచిత రాజకీయాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్, పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షుడు పల్లా కొండలరావు సూచించారు. మండలంలోని చిరునోముల గ్రామంలో ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, మాజీ సర్పంచ్ కొంగర వెంకట నారాయణ, కందికొండ శ్రీనివాసరావు, దొప్పకొరివి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బోనకల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామంలో ఆదివారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వంద మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు టి. పవన్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బత్తినేని ట్రస్టు సభ్యుడు తూము రోషన్ కుమార్, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆర్ఎంపీడబ్ల్యుఏటీఎస్ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండలరావు, ఆకేన పవన్, యంగల గిరి, ఏలూరి పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.



మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

» తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థ ఏజీవో తాతారావు



విద్యార్థినిని అభినందిస్తున్న అధికారులు

వైరా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థ ఏజీవో కె.తాతారావు సూచించారు. వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వరరావుతో కలిసి ఏజీవో తాతారావు జ్యోతిప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల్లోని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూరుస్తుందన్నారు. వాటిని ఉపయోగించుకొని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రిన్సిపల్ బత్తుల రమ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

'లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏన్కూరు, మార్చి2(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కళ్యాణపు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అనుబంధ సీఐటీయూ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు సంబంధించిన 26 చట్టాలను రద్దు చేసి నాలుగుకోడ్‌లుగా మార్పుచేసి కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూర్ణకంటి సీతారాములు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల వెంకటేశ్వర్లు, ఉప ఉపాధ్యక్షుడిగా పల్లెబోయిన నాగేశ్వరరావు, షేక్ సైదులు, గుండంశెట్టి అప్పమ్మ, ఎం.ఆదామ్, పూర్ణకంటి చంటిని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీను, మండల కార్యదర్శి ఏర్పుల రాములు పాల్గొన్నారు.

శ్రీపాదరావు జయంతి వేడుకలు



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్, మార్చి2(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టనష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగిన దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను మండలంలోని గంగారంలోని 15వ బెటాలియన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీధర్‌రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మరణించినా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్స్‌లో ఇసుక మార్పిడి

వైరా, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ గుట్టలపైనున్న బోడేపూడి సుజల స్రవంతి(మిషన్ భగీరథ) హెడ్‌వర్క్స్‌లోని ఫిల్టర్ బెడ్స్‌లో ఇప్పటివరకు ఉన్న ఇసుకను ఆదివారం తొలగించారు. ఆవెంటనే కొత్త ఇసుకను ఫిల్టర్‌బెడ్స్‌లో నింపారు. ఈ వేసవి కాలంలో రిజర్వాయర్‌లోని నీటిని ఫిల్టర్‌బెడ్స్‌లో శుద్ధి చేసి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు చేపట్టిన చర్యల్లో భాగంగా పాత ఇసుకను తొలగించి కొత్త ఇసుకను పోశారు. పదేళ్ల తర్వాత ఇసుక మార్పిడి జరిగింది. ఈ ఫిల్టర్‌బెడ్స్‌లో ఈ ఇసుక పోయడం ద్వారా నీటి శుద్ధి జరిగి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయనున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏన్కూరు, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి 1981-82 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈకార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవిరామయ్య, అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అనంతరం వారికి పూర్వవిద్యార్థులు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా సత్యనారాయణ, తాళ్లూరి అప్పారావు, నల్లమల ప్రసాద్, గుత్తా శ్రీనివాసరావు, గాలీబ్, ఉప్పెర్ల ఆనందప్రసాద్, వెనిగళ్ల శ్రీహరి, మండేపుడి సూర్యనారాయణ, నల్లమోతు వెంకటేశ్వర్లు, బొంతు రాఘవయ్య, మిరియాల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చావా నారాయణరావుకు జన్మదిన శుభాకాంక్షలు



అభివృద్ధిలో ఆదర్శం 'చావా'



ఖమ్మం,మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రగతిని సాధించే పచ్చని చెట్లు, చిన్నారుల ఆటలకు అందమైన పార్కులు, ఆధ్యాత్మికానికి ఆలయాల పురోగతి.. ఒకప్పటి ఆ డివిజన్‌కు, ప్రస్తుతానికి పెద్ద ఎత్తున మార్పులు చేసిన ఘనత ఆయనది. అందుకే కార్పోరేటర్‌గా విశిష్టమైన సేవలదించిన ఆయన్ను ఆ డివిజన్ ప్రజలు మళ్లీ కావాలని భావించారు. ఆయనే పదో డివిజన్ మాజీ కార్పొరేటర్, మంత్రి తుమ్మల ముఖ్యఅనుచరుడు చావా నారాయణరావు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందా? లేదా? అన్న సందిగ్ధంలో ఉన్న సమయంలో చాలా మంది నాయకులు వెనకడుగు వేసినప్పటికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి తొలి అడుగు వేశారు. నియోజకవర్గంలో ఆ పార్టీకి మరింత బలం చేకూర్చేందుకు టర్నింగ్ పాయింట్‌గా నిలిచారు. ఆయనతోపాటుగా మరికొందరు నాయకులను సైతం పార్టీలోకి ఆహ్వానించి ఖమ్మం నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీని, మంత్రి తుమ్మలను గెలిపించేందుకు ఎంతగానో కృషి చేశారు. తుమ్మల గెలుపు అనంతరం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాశ్రేయస్సు కోసం, పట్టణ అభివృద్ధి కోసం తనవంతు పాటుపడుతూ ముందుకు సాగుతున్నారు. మొదటిసారి కార్పొరేటర్‌గా గెలిచిన ఆయన డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగారు.దాంతో రెండోసారి సైతం ఆయననే కావాలని కోరుకున్న ప్రజలు 2021 కార్పొరేషన్ ఎన్నికల్లో చావా మాధురి నారాయణరావును ఏకగ్రీవంగా ఎన్నుకుని ఎవరికీ దక్కని ఖ్యాతిని ఆయనకు కట్టబెట్టారు. తన డివిజన్‌ను సుందరీకరణ దిశగాఅడుగులు వేయించారు. పదులకొద్దీ అభివృద్ధి పనులు నిర్వహించి ఆదర్శంగా నిలిపారు. డివిజన్‌లో ఏ అంతర్గత రహదారిని చూసినా సీసీ రోడ్లను నిర్మించడంతోపాటు, ఆయా రోడ్లు పచ్చని చెట్లతో కళకళలాడేలా ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టారు.



